# కథ పూర్తికాలేదు

చాలా కాలానికి కథ రాయాలని కూర్చున్నాను.

ఓ మంచి ప్రేమ కథ రాయటానికి ప్లాటు కోసం ఆలోచించసాగాను. రెండు రోజుల కిందట నా స్నేహితురాలు రజ ఢిల్లీనుంచి రాసిన ఉత్తరం గుర్తొచ్చింది.

"నీ కథలు ఈమధ్య ఏ పత్రికలోనూ రావటంలేదు. నా స్నేహితురాలు ఒక రచయిత్రి అని గొప్పగా చెప్పుకుంటుంటాను. కాని నువ్వు రాసిన కథ చదివినప్పుడల్లా నాకు నిరాశే కలుగుతుంది నీవు ఎన్నుకొనే ఇతివృత్తం ప్రతీసారీ శుష్కంగానే వుంటూంది. ఇలా రాస్తున్నందుకు బాధపడకు జానకీ.... నీ కథల్లో కమనీయ కల్పనకు తావు లేనందువల్లనే అవి పాఠకుల హృదయాలను ఉర్రూత లూగించ లేకుండా వుంటాయి. నీలాంటివాళ్ళు సాహిత్యానికి

ఒక ప్రయోజనాన్ని అంటుగట్టటానికి ప్రయత్నిస్తారు. ఇకమీదటనైనా చక్కని ప్రేమ కథలు రాయటానికి ప్రయత్నిస్తావు కదూ ?"

"అయితే నీరజా ! నా కథలో ప్రేమను భుజించి జీవించేవారికి తావు లేదంటావు. నా కథ నాయకుడు, నాయకి సౌందర్యానికి ముగ్ధుడై భ్రమరంలా ఆమె చుట్టూ తిరగడంటావు ? ఆ తరువాత నిరాశతో, నిస్పృహతో శలభంలా ఆత్మ సమర్పణచేసి. మాడి ; నుసిగా మారిపో డంటావు. అంతేనా ! నువ్వు పొరపడుతున్నావు నీరజా ! ఒక అందమైన వస్తువును చూసినప్పుడూ, మధురగానాన్ని విన్నప్పుడూ నా హృదయం కూడా ఏదో అవ్యక్త వేదనా జనిత అనుభూతికి గురి అవుతుంది నా మస్తిష్కంలోనూ ఎన్నో ప్రేమ కథలూ, ఆ కథల్లో ఇంద్రధనస్సు రంగులూ ఆ రంగుల్లో సృష్టి సౌందర్యాన్నంతా తనలోనే ఇముడ్చు కున్నదా అన్నంత అందమైన అమ్మాయీ, నిరాశతో, నిట్టూర్పులతో ఇల్లు విడిచి అష్టకష్టాలపాలయి చివరకు ఆ అమ్మాయిని చేబట్టే అబ్బాయీ తిరుగుతూనే వుంటారు. కాని అంతకంటే ఎక్కువ హైడ్రోజను బాంబులూ, అటమ్ బాంబులూ, మొన్న మొన్న మన దేశంమీద దురాక్రమణ చేసిన చైనా వాళ్ళూ కాలే కడుపులతో, మండే ఎండలో చంకన సోష కొచ్చిన పసిబిడ్డతో రేషన్‌కోసం క్యూలో—

ఎముకలు గుడ్డసంచిలోవేసి కుట్టినట్లున్న స్త్రీలూ, కొందరి అసహాయ మానవుల జీవితాలను చుట్టివేసే విషవలయాలూ రెక్కలు ముక్కలయేలా వెట్టిచాకిరీ చేసినా కూడా పెళ్ళాం బిడ్డల్ని పోషించలేని ఎన్. జి. ఓ. లూ నా కళ్ళముందు కదులుతూ వుంటారు. అయితే నీరజా ! ఒకటడుగుతాను. చెబుతావా ? ఈనాడు మానవుడు సృష్టిస్తున్న మారణాయుధాలముందు ప్రేమజీవులూ సుకుమారులూ అయిన ఈ హీరోలూ హీరోయిన్‌లూ నిలబడగలరంటావా ? మొన్న మొన్ననే చైనావాడు ఆటమ్‌బాంబు పేల్చాడు...."

నీరజకు రాయాలని ప్రారంభించిన నా జాబు అసంపూర్ణంగానే వుండిపోయింది. ఈరోజు ఒక చక్కని ప్రేమకథ రాసి, అది అచ్చయిన తరవాతనే నీరజకు జవాబు రాయదలచుకున్నాను. నా స్నేహితురాలి ముందు నేనూ ప్రేమకథలు రాయగలనని నిరూపించుకుంటాను.

కథకు ప్లాటుకోసం ఆలోచించ నక్కరలేదు— ఈనాటి ప్రేమకథలన్నీ ఒకేలా వుంటాయి కాబట్టి, ఇక పోతే ఓ మంచి హీరోయిన్ను వెతుక్కోవాలి ? ఎలాటి హీరోయిన్ అయితే బాగుంటుంది ! సన్నగా పొడవుగా కోలముఖంతో వున్న హీరోయిన్ బాగుంటుందా లేక పొట్టిగా బొద్దుగా చంద్రబింబంలాంటి ముఖంతో మూడుసున్నాలు చుట్టినట్లుండే హీరోయిన్ బాగుంటుందా ? హైదరాబాదులో నాకు

తెలిసిన వీధులన్నీ వెదికాను. ఉహూఁ నాకు నచ్చిన హీరోయిన్‌కు వుండాల్సిన సకల సద్గుణాలకూ ఆలవాలమైన సౌందర్యరాసి దొరకందే !

ఆలోచించి ఆలోచించి బుర్ర వేడెక్కింది. కాని నాకు కనిపించే ప్రతి హీరోయిన్‌లోనూ ఏదో లోపం కనిపిస్తూనే వుంది. యాంత్రికంగా లేచి వెళ్ళి కిటికీ రెక్కలు తెరిచాను. గాలితోపాటు చిల్లపెంకులు విసిరినట్లు పెద్ద వానజల్లు. వంచకుని హృదయంలోని కాలుష్యంలా చిక్కని చీకటి నలువైపులా అలుముకొని వున్నది.

"అయ్యో ఇల్లంతా తడుస్తుంటే అలా నిలబడి చూస్తావేమే ?" అమ్మ కేకతో ఉలిక్కిపడ్డాను. కిటికీ మూసి టవల్‌తో ముఖం తుడుచుకుంటూ కుర్చీలో కూర్చున్నాను. కళ్ళుమూసుకొని హీరోయిన్‌కోసం ప్రయాణం సాగించాను.

అదుగో ! నాకు కావల్సిన హీరోయిన్. ఆ చిన్న కొండశిఖరంమీద ఎంత వయ్యారంగా నిలబడి వుందో ; ఏమా దివ్య సౌందర్యం ! విధాత మెరుపును పట్టితెచ్చి తేనెలో రంగరించి ఆమెకు రంగు వేశాడు. కోడెత్రాచులను తెచ్చి జుట్టుగా అమర్చాడు సాక్షాత్తూ రెండు పెద్ద పెద్ద చేపలతోనే కళ్ళు అమర్చాడు, ఆమె అందమైన కళ్ళకు. మేఘాలను రంగరించి కాటుకగా దిద్దుకున్నది. ఇంద్ర ధనస్సును చీరగా ధరించింది. సంధ్యారాణి చెక్కిళ్ళ

అరుణిమను చిటికెన వ్రేలితో నొసట తిలకంలా దిద్దుకున్నది. ఆమె కళ్లు ఎటు తిప్పితే అటే గులాబీలు పూస్తున్నాయి. ఆమె తన ఆ పెద్ద పెద్ద కళ్ళలో ఆదుర్దాలను నింపుకొని దేనికోసమో.... కాదు ఎవరికోసమో ఎదురు చూస్తున్నది. ఎవరికోసమో ఏమిటి, హీరో కోసమే. అందులో ఏమాత్రం సందేహం వుండదు. ఏం, ఆమె హీరో కోసమే ఎదురు చూస్తున్నదని ఎందు కనుకోవాలి ?

సజల మేఘమాలను చూసి మయూరం ఎందుకు నృత్యం చేస్తుంది ? వసంతాగమనవేళ కోకిల కంఠం ఎందుకు విచ్చుకుంటుంది ? దినకరుని అరుణకిరణాల మృదుస్పర్శకు కమలంయొక్క హృదయ కవాటాలు ఎందుకు తెరచుకొంటున్నాయి ? తన కరుణ గాధను వినిపించే శక్తిలేని శలభం తన జీవితాన్ని దీపకళికకు ఎందుకు సమర్పించుకుంటుంది ? అందుకే నా కథానాయిక కూడా తన ప్రియునికోసమే ఎదురు చూస్తున్నది.

ఆఁ తరవాత ? అరే ! కలం కదలందే ! ఇంతవరకూ బ్రహ్మాండంగా నడచిన నా ప్రేమకథ అలసిపోయి ఇక నా కాళ్ళలో శక్తిలేదు సుమా, ముందుకు నడవలేను— అంటూ మొండికెత్తి కూర్చున్నది. ఏం చెయ్యాను ? నా హీరోయిన్‌వైపు దిగులుగా చూశాను. ఆమె కోపంగా చిరాగ్గా నా వంకే చూస్తున్నది...." ఇంకెంతసేపు నన్ని

కొండమీద కదలకుండా నిల్చోమంటూవు " అన్నట్లు.... షూటింగ్‌లో హీరోయిన్ ' ఇంకెంతసేపు కెమెరాముందు నిల్చోమంటూవయ్యా ' అని డైరెక్టర్‌వైపు చూస్తున్నట్లుందా చూపు.

బుర్రలో ఓ మెరుపు మెరిసింది. ఆఁ అవును ! అన్నట్టు హీరోను ప్రవేశ పెట్టాలిగా ! అమ్మయ్య—ఇక ఫరవాలేదు. నా కథ చిన్నగా లేచి నిల్చున్నది నడవటానికి సిద్ధమవుతూ. కాని హీరోను తేవాలిగా ముందు ? ఎలాటి హీరో అయితే బాగుంటాడు ! గుర్రం ఎక్కి వస్తాడా లేక కార్లోనా ? ఈ రోజుల్లో గుర్రం ఎక్కే హీరోలంటే ఎవరు మోజు పడతారులే. నా హీరో కార్లోనే వస్తాడు. కాని కార్లో వచ్చే హీరోలతో పెద్ద చిక్కొకటి వుంది. వస్తూనే అమాంతంగా హీరోయిన్ను కార్లో వేసుకొని తుర్రున వెళ్ళిపోతారు. మరి నాకు రాయటానికి ఏం మిగులుతుంది ? లేదు నా హీరో నడిచే వస్తాడు. చెరిగిన జుట్టూ....చిరిగిన చొక్కా....మాసిన ధోవతీ, కాళ్ళకు చెప్పులు వుండాలా.... వుంటాయి కాని చిరిగిపోయి దుమ్ము కొట్టుకొని వుండాలి.

పెళపెళామంటూ ఉరుము. ఉలిక్కిపడ్డాను. చేతిలో కలం జారి కిందపడ్డది. పిడుగు పడివుంటుంది. పిడుగు పడితేనే ఇంత భయంకర శబ్దం అయిందే....మరి నిజంగా అటంబాంబు పడితేనో ! అమ్మబాబోయ్ !

......అనాడు సరిగ్గా ఆటంబాంబుపడే సమయానికి.... హిరోషిమాలో ఎందరు తల్లులు తమ పసిబిడ్డలను హృదయాలకు హత్తుకొని కలలు కంటూ వుండి వుంటారో! వారంతా ఆ కలల్లోనే కరిగి కలిసిపోయి వుంటారు కాని ఆ వార్త విన్న యూరపులోని ఎన్ని మాతృ హృదయాలు ఆనందంతో తృళ్ళి వుంటాయో....యుద్ధం ముగుస్తుందనీ, తమ బిడ్డలు సురక్షితంగా ఇంటికి తిరిగి వస్తారనీ తెలుసుకొని....సృష్టి వైచిత్ర్యం!

అరే! మధ్యలో ఈ ఆలోచన ఏమిటి? మళ్ళీ నా కథ కుంటుపడుతూ వుంది. నా హీరో ఏడీ? పోనియ్ పిరికివాడు. పిడుగు పడేప్పటికే పారిపోయాడు.

హీరోయిన్‌వైపు చూశాను బుంగమూతి పెట్టింది. కోపంలో ఎంత అందంగా వుందో నా హీరోయిన్!

“ఆఁ ఏమిటీ! వెళ్ళిపోతావా? మా తల్లివి గదూ.... వెళ్ళిపోకు; పిరికివాడు పోతే పోయాడు. నీకోసం ఇంకొక మంచి హీరోను వెతికి తెస్తాగా!”

మాటయితే అన్నాను కానీ ఎక్కడనుంచి తేవటం, ఆమెకు సరితూగే హీరోను? ఆఁ, గుర్తొచ్చాడు. చిన్నప్పుడు అమ్మమ్మ చెప్పిన కథల్లోని హీరోకంటే గొప్పవాళ్ళా ఈ రోజుల్లో హీరోల! ఇక ఫర్వాలేదు. ఇక నా కథ చక్కగా సాఫీగా ముందుకు నడవగలదు.

వర్షం అంత కంతకూ పెరుగుతున్న శబ్దం. మధ్య మధ్య ఉరుములు....

అరె ! ఇ కథ గొడవలోపడి పాపం లైకా సంగతే మర్చిపోయాను. వర్షంలో బాగా తడిచిపోయి వుంటుంది. దానికి జబ్బుచేస్తే మళ్ళీ ఆసుపత్రి చుట్టూ తిరగాలి. తలుపు తెరిచానో లేదో ఒక మూల ముడుచుకొని పడుకొనివున్న లైకా ఒక్కసారిగా లేచి వళ్ళు విదిలించుకొని, తోక ఆడిస్తూ వచ్చి నా ఎదురుగా వున్న కుర్చీ ఎక్కి పడుకుంది. నోరులేని ఆ కుక్కపిల్ల కళ్ళతోనే కృతజ్ఞత తెలుపుకుంది.

పాపం, రోజూ ఆ బస్‌స్టాండులో కనిపించే ముసలి ముష్టివాడు ఈ వర్షంలో ఏమయాడో ? ఆ ఎముకలగూడును ఎంతోకాలంగా ఆశ్రయించుకొనివున్న ఆ మురికి గుడ్డపీలికలు తడిచి, అతుక్కొని ఆత్మీయతను తెలియపరుస్తూ వుండి వుంటాయి. ఇంత వర్షంలో, ఆ షెడ్డులోనే ఎముకలగూడు నుంచి జీవహంస ఎగిరి ఏ మానస సరోవరానికో వెళ్లిపోయి వుండవచ్చు.

అతనికి ఓ నయాపైసా ఇచ్చి, దీవెన లందుకోని రోజు నాకు యెలాగో వుంటుంది. రేపటినుంచి అతను నన్ను దీవించలేడు. నిర్జీవంగావున్న ఆ యెముకల సంచి నా కళ్ళముందు పడివున్నట్లు అనిపిచింది.

నా ఆలోచనలను అర్థంచేసుకున్నట్లు లైకా పడుకొని నా ముఖంలోకి చూస్తున్నది. "ఆ అసహాయ మానవుని కంటే నువ్వెంతో అదృష్టవంతురాలవు లైకా. నీకు తెల్లవారేప్పటికి పాలు కావాలి. మాంసం లేనిదే అన్నంలో మూతి కూడా పెట్టవు" అన్నాను. నా భాష దానికి అర్థం అయినట్లు తల కాళ్ళసందున ఇరికించుకున్నది. లైకాకే మాటలొస్తే ....

ఏమిటీ పిచ్చి! నా కథ మళ్ళీ పెడమార్గం పట్టింది. వెధవ ఆలోచనలూ .... నేనూ .... నీరజ అన్నట్లుగానే నాకు నిజంగా అబ్బాయీ, అమ్మాయిల కథలు రాయటం రాదేమో ? ఎందుకు రాదో చూస్తాను. ఇవ్వాళ ఈ కథను తప్పక పూర్తిచేస్తాను.

అరె! నా హీరోయిన్ ఏమయింది? విసుగెత్తి వెళ్లిపోయిందిలా ఉంది. అరె ఆమె ఇంతసేపూ నిల్చున్న ఆ కొండ కూడా యెక్కడా కనిపించటంలేదు. ఏ భావ కవినో వెతుక్కుంటూ వెళ్ళిపోయి ఉంటుంది హీరోయిన్ పోనీయ్‌లే ఒక రకంగా మంచిదే అయిందేమో .... ఆ హీరోయినూ ఆ వర్ణనా చూస్తే పాతకాలపు కథ తయారయి కూర్చునేది.

ప్రేమ పందెంలో ఓడిపోయిన హీరోతో ప్రారంభిస్తే కథ యెలా ఉంటుంది? అవును. అలాగే చేస్తాను.

ఈ రోజుల్లో ఇలాంటి కథలకే మంచి డిమాండ్. ఈ దెబ్బతో ఆంధ్రదేశంలో బ్రహ్మాండమైన కీర్తిని గడించుకోవచ్చు.

ఊరి బయట. గోదావరి వడ్డు. ఒక పూరిగుడిసె. ఆ గుడిసెలో కోడిగుడ్డు లాంతరు మిణుకు మిణుకుమంటూ వెలుగుతూంది. దీపపు పురుగులు లాంతరు చుట్టూ చేరుతున్నాయి. రెక్కలు ఊడిపోతున్న పురుగులు రెండు నిమిషాలు తన్నుకొని చచ్చిపోతున్నాయి. వాటిని చూసి మిగతా పురుగులు ఆగటంలేదు. వస్తూనే ఉన్నాయి.... చస్తూనే ఉన్నాయి. కొన్ని జీవంతో వుంటే, కొన్ని నిర్జీవంగా.... చావూ—బ్రతుకూ—రెంటికి ఎంతో దూరం లేదు.... పక్క పక్కనే నడుస్తుంటాయి. అస్తిపంజరానికి చర్మం కుట్టినట్టున్న ఓ యువకుడు దీపపు పురుగుల్నే దీక్షగా చూస్తున్నాడు. అతని ముందు కొన్ని కాగితాలు పడివున్నాయి గాలిలో అటూ ఇటూ ఎగురుతున్న పురుగుల రెక్కలను చూస్తున్న ఆ యువకునికి తను కన్న కలలూ పెంచుకున్న కోర్కెలూ, ఆశించిన ఆశలే తన కళ్ళముందు నిస్సహాయంగా గాలిలో కొట్టుకుంటున్నట్లనిపించింది ఆ కోడిగుడ్డు లాంతరులాగే అతని జీవనజ్యోతి కూడా రెప రెప లాడుతోంది అతని కళ్ళలో కాంతి కొడిగట్టిపోయింది. పెద్ద నిట్టూర్పు విడిచాడు.

అతను ఒక భావకవి. ఒక అమ్మాయిని ప్రేమించి మోసపోయాడు. ఆ అమ్మాయి సానుభూతిని సాధించటానికి

త్రాగుబోతు అయాడు. వ్యభిచారి అయాడు. ఆస్తి అంతా హారతి కర్పూరంలా హరించుకుపోయింది. చివరికి అతనికి మిగిలింది ఆ పూరి గుడిసె, కోడిగుడ్డు లాంతరూ, ఆ లాంతరు చుట్టూ చేరే పురుగులూ. అచ్చుగాని అతని కవిత్వం, ఎముకల్లోని మూలుగును కూడా పీల్చేస్తున్న క్షయవ్యాధి....

ఎదురింట్లో ఎవరో ఖళ్ళు ఖళ్ళున దగ్గుతున్నారు. చక్కగా నడుస్తున్న కథకు మళ్ళీ అడ్డంకు. వెధవ కాలనీ. ఇదే గొడవ. ఇరుగు పొరుగు ఇళ్ళలో తుమ్మినా వినిపిస్తుంది. దగ్గినా వినిపిస్తుంది....అరే పాపం! గుక్క తిప్పుకోకుండా దగ్గుతున్నాడే! ఎవరో ఏమిటి ఎదురింటి రాఘవరావే. ఏమిటో జీవితం — అతనికి క్షయ. ఉద్యోగం గుమాస్తాగిరి. భార్య అమాయకురాలు అయితేనేం, అరడజనుమంది ఆడపిల్లల్ని ఇచ్చింది బర్తకు. ఆ భార్యా భర్తలకు ఒక మొగ నలుసు ఏనాటికైనా కలక్కపోతాడా అనే ఆశ వదల్లేదు. ఎముకల్లో మూలుగు కరిగి, కళ్ళలో కాంతి మందగించిన ఆమెలో మళ్ళీ ఇంకో ప్రాణి జీవం పోసుకుంటున్నది. రెండు వందలు జీతం. పైగా గత ఆరు మాసాలుగా అర్ధ జీతంమీద శలవల్లో వున్నాడు. క్షయరోగం, రాజరోగం. ఎంత డబ్బు ఖర్చుపెట్ట గలిగితే అంతకాలం బతకవచ్చు. రాఘవరావుకు డబ్బూ లేదు. అండా లేదు. ఏరోజు హరీ అంటాడో చెప్పలేము. తరవాత

అమాయకురాలైన ఆ ఇల్లాలూ....ముక్కుపచ్చలారని ఆ పసి బిడ్డలూ....ఏం కావాలి ?

ఛ ! ఏమిటిది. మళ్ళీ నా కథకు అంతరాయం. ఆఁ. నా హీరో ఏడీ ! అరే నిర్జీవంగా పడివున్నాడే ; కోడిగుడ్డు లాంతరు ఆరిపోయింది. ఇంత అర్థాంతరంగా చచ్చిపోయిన హీరోతో కథ ఏమిటి ?

మళ్ళీ ఇంకో హీరోను ఎక్కడనుంచి వెతుక్కురానూ ! పోనియ్ ! నీరజను హీరోయిన్‌గా తీసుకుంటే ? అవును బాగానే వుంటుంది. ఆమె ప్రేమించి వివాహం చేసుకున్నది. వివాహం జరిగినంతవరకూ జరిగిన కథ నాకు తెలుసు. కాని ఆ తరవాత వాళ్ళ సంసారం కళ్ళారా చూస్తేనేగాని లాభం లేదు. ఈ రోజుల్లో ఎన్ని ప్రేమ వివాహాలు మూడునాళ్ళ ముచ్చటు కావడంలేదు !

"పెళ్ళాన్నీ పిల్లల్నీ పోషించటం చాతకానివాడివి నువ్వూ ఒక మగాడివే ?" ఆడగొంతు మగవాణ్ణి ఏ మాట అనకూడదో అదే అనేసింది.

"నోర్మూయ్ ! నువ్వేగా కావాలని వెంటబడి మరీ చేసుకున్నావు ?" మగ గొంతు.

"ఓ యబ్బో నీ మాత్రం మగాడు...." ఏడుపుగొంతు "నోరు మూస్తావా లేదా ?" అన్న మగవాడి గర్జింపుతో మధ్యలోనే ఆగిపోయింది.

పక్కింటి కాంతమ్మ ఏడుపు తారస్థాయి నందుకుంది. మొగుడు ఆమె జుట్టు పట్టుకొని వంగదీసి బాదుతున్నా డనుకున్నాను. రాత్రి వది గంటలు దాటిన తరవాత ఆ ఇంట్లో రోజూ ఇదే వరస. కాంతమ్మ భర్త సత్యనారాయణ ఇంట్లో పెళ్ళాం బిడ్డలకు తిండికి లేకపోయినా, ఏ పావలా కల్లో నోట్లో పోసుకోంది ఇంటికి రాడు. ఆ ఇల్లాలు కడుపు మండి తిడుతుందంటే తిట్టదూ మరి! ఆకలి ఏం చేయించదు? ఆకలి ఎండుగడ్డిలాటిది మండటానికి ఏ చిన్న నిప్పురవ్వయినా చాలు.

ఈ భారతదేశంలో స్త్రీ సమస్యలకు ఏనాటికైనా పరిష్కారమంటూ దొరుకుతుందా అనేది సందేహమే. పుట్టినప్పటినుంచీ చచ్చేంతవరకూ ఆడదానికి మగాడి అండ ఏదో రూపంలో తప్పడంలేదు అనడంలో అతిశయోక్తి లేదేమో!

కాని గిరిజ ఈ వాదాన్ని చస్తే ఒప్పుకోదు. గిరిజా, నీరజా, నేనూ ఒకే హైస్కూల్లో చదువుకున్నాము. గిరిజా, నీరజా ఒకటిగా చేరి నాతో వాదించేవారు. స్త్రీకి బతకటానికి పురుషుడి అండ అక్కర్లేదనీ, తరతరాలుగా సమాజం గీచిన గీట్లలో కొండశిలవల్లా బతకటం తమకు ఇష్టం లేదనీ, సాధారణ స్త్రీ జీవితానికి భిన్నంగా బ్రతికి చూపిస్తామనీ వాదించేవారు. ముఖ్యంగా నీరజ దృష్టిలో స్త్రీ స్వతంత్రంగా

జీవించటమంటే పురుషుణ్ణి అనుకరించడమే. ఆమెను అందరూ మగరాయు డనేవారు. స్కూలుఫైనల్ కాగానే ఢిల్లీ వెళ్ళింది. అక్కడ ఆమె జీవితంలో నిరంజన్ వర్మ అడుగుపెట్టాడు. అంతటితో ఆమె ఆదర్శాలన్నీ ఇసుకలో కట్టిన బొమ్మరిళ్ళయ్యాయి. అందర్నీ ఎదిరించి ప్రేమ వివాహం చేసుకుంది. జీవితంలోని చేదును రుచి చూచే అవకాశం ఆమెకు ఏనాడూ కలుగలేదు. అందువల్లనే నీరజకు నా కథలు నచ్చవు.

కాని గిరిజ మాత్రం తన ఆదర్శాలను ఇంకా అంటిపెట్టుకునే వుంది. గిరిజ చిన్నప్పటినుంచీ జీవితంలోని చేదునే రుచిచూసింది. బీదతనం, చిన్నప్పుడే తల్లి పోయింది. ఆమె స్కూలుఫైనల్ పాసయిన సంవత్సరమే తండ్రి కూడా పోయాడు పదిహేడు సంవత్సరాలు కూడా నిండని గిరిజ మీద పన్నెండేళ్ళ తమ్ముణ్ణి పదేళ్ళ చెల్లెల్నీ పోషించవలసిన బాధ్యత పడింది. కొంతకాలం యెలిమెంటరీ స్కూల్లో టీచరుగా పనిచేసింది. ఇప్పుడు ఒక గవర్నమెంటు ఆఫీసులో స్టెనోగ్రాఫరుగా పనిచేస్తున్నది.

గిరిజ అంటే గుర్తొచ్చింది. సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేప్పటికి ఆమెనుంచి వచ్చిన ఉత్తరాన్ని చదవటం మర్చేపోయాను. కాగితాలూ, కలం పక్కనపెట్టి, లేచివెళ్ళి రేడియోమీద వున్న కవరుతీసి చించాను. ఆశ్చర్యం!

పన్నెండు పేజీల ఉత్తరం. ఉత్తరాలు వ్రాయటంలో బ్రహ్మా సోమరయిన గిరిజనుంచి అంత పెద్ద ఉత్తరం రావటం నాకు ఆశ్చర్యాన్నీ, అదుర్దాను కూడా కలిగించాయి. గబగబా చదవసాగాను.

" ప్రియమైన జానకీ !

ఎంతో కాలానికి చాలా పెద్ద జాబు రాస్తున్నాను. నేను రాసింది పూర్తిగా చదివి నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. నా జానకి నన్ను అసహ్యించుకోదనే నమ్మకంతోనే నా హృదయాన్ని తెరిచిన పుస్తకంలా నీ ముందు వుంచుతున్నాను.

నాకు చిన్నతనంనుంచీ ఆధ్యాత్మిక విషయాలమీద అసక్తి యెక్కువగా వుండేది. నాకు నేనే " జీవితం అంటే ఏమిటి ? " అని ప్రశ్నించుకొనేదాన్ని. నిన్ను కూడా ఎన్నోసార్లు ప్రశ్నించాను గుర్తుందా ? జీవితంలో ఇలాటి ప్రశ్నలు వేసుకోనివారూ, మనం ఎందుకు బతుకుతున్నాము. ఎందుకు బతకాలి అని ప్రశ్నించుకోనివారంత అదృష్టవంతులు ఈ ప్రపంచంలో మరొకరుండరనుకుంటాను. ఎక్కువ తింటూ తక్కువ ఆలోచించేవాళ్ళు, చాలా అదృష్టవంతులు. బుద్ధిబలం ప్రాధాన్యంగా మగవాడు జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటాడు. ప్రాక్టికల్‌గా బతుకుతాడు. అందువల్ల మేధావులు ఎక్కువగా భౌతిక

సుఖాలను అందినంతవరకూ అనుభవిస్తూంటారు. సాధారణ మానవునిలా నీతి నియమాలకూ, పాప పుణ్యాలకూ భయపడుతూ కూర్చోరు. కాని మేధావి అయిన స్త్రీలో ఆధ్యాత్మిక మనస్తత్వం పెంపొందుతుంది. వారిలో ప్రాపంచిక విషయాలపట్ల విరక్తి పెరుగుతుంది. ఇలాంటి స్త్రీలు ఎక్కువగా కలల్లోనే బతకటానికి ప్రయత్నిస్తారు.

నేను చిన్నప్పటినుంచి కల్పనాలోకంలో బతికేదాన్ని. ఒక వస్తువును కల్పనలో ఊహించుకుంటే కలిగే ఆనందం వాస్తవంగా అనుభవించినప్పుడు కలగదని నా అభిప్రాయం. ఏది ఏమయినా నేను సాధారణ జీవితానికి భిన్నంగా బతకా లనుకున్నాను. కలలు కనడం తప్పుకాదు. ఆ కలల్నే జీవితం అనుకోవటమే నేను చేసిన తప్పు. నాకు ఏది అక్కరలేదో తెలుసుకున్నాను. కాని నాకు కావల్సిందేదో ఎన్నడూ ఆలోచించలేదు.

జానకీ! గుర్తుందా? ఓసారి నాతో అన్నావు. "యదార్థంనుంచి నువ్వు ఎంత కాలం పారిపోగలవో చూస్తానుగా?" అని.

"నదీ తీరాలు సమానాంతరంగా వుంటాయి. అవి ఎన్నటికీ కలుసుకోవని యదార్థం చెబుతుంది. కాని ఏనాటికైనా కలుసుకోకపోతాయా అని ఆదర్శం కలలు కంటుంది. యదార్థంతో పొట్టనిండుతుంది. ఆదర్శంతో

ఆత్మకు ఆనందం అందుతుంది. నాకు కావల్సింది ఆత్మ తుష్టి. శారీరక పుష్టి కాదు. ఇదీ అప్పటి నా సమాధానం.

కానీ జానకీ ! ఈనాడు నేను నీ ముందు ఓడిపోయాను. యదార్థంముందు ఆదర్శం తల వంచింది. నేను ఈనాడు పతితను.

ఏం ? చదివి పులిక్కిపడుతున్నావు గదూ ? ఈమాటే నీవు ఇంకొకరిద్వారా వింటే నమ్మేదానివి కాదు కదూ ? నేను పతితను జానకీ ! అయినా సృష్టంతా తనకు ఏమీ పట్టనట్టే తన పనులను యధావిధిగా నిర్వహించుకు పోతున్నది.

నేను ఒక ఆఫీసులో స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తున్నానని తెలుసుగా ? చేసేది చిన్న ఉద్యోగం. బాధ్యతలు తక్కువ. ఆడంబరాలూ, కోరికలూ తక్కువ కాబట్టి నేను జీవితాన్ని సంతృప్తిగానే గడుపుతున్నాను. నా స్నేహితులు స్టేట్ లైబ్రరీలోని పుస్తకాలే. ఆఫీసు గొడవల్లో తటస్థంగా వుండేదాన్ని.

నా కళ్ళముందు చిన్న చిన్న ఉద్యోగాల్లో చేరిన ఆడపిల్లలు ఎంతమందో ఇట్టే పెద్ద ఉద్యోగాలు సంపాదించటం చూస్తే ఆశ్చర్యం వేసేది. కాని ఆ విషయాలు కూడా అట్టే పట్టించుకొనేదాన్ని కాదు.

కొంతకాలంగా మా ఆఫీసరు నామీద చిర్రుబుర్రులాడటం మొదలుపెట్టాడు. అనవసరంగా కోప్పడేవాడు. కిక్కురుమనకుండా గుడ్లనీరు గుడ్ల కుక్కుకొని బయటబడేదాన్ని. ఆమధ్య ఒకరోజు టైపింగ్‌లో ఏదో చిన్న తప్పు చేసినందుకు నానా మాటలని ఫైలు ముఖంమీద కొట్టాడు. వంగి ఫైలు తీసుకొని నా గదికి గబగబా వెళ్ళిపోయాను. ఏడుపు పొర్లుకొచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తున్నాను.

మా సూపరింటెండెంటు రామ్మూర్తి వచ్చి నన్ను ఓదార్చసాగాడు. అతడు నన్ను కన్న కూతురి లా అప్యాయంగా చూస్తాడు. అతన్ని చూడగానే బోరుమన్నాను.

ఊరుకోమ్మా! సర్వీస్ అంటే ఇంతే. మనం ఎన్. జి. ఓ. లం. ఆఫీసర్లేమన్నా మనం బాధపడకూడదు. అనటం వాళ్ళ హక్కు. పడటం మన బాధ్యత. అన్నాడు రామ్మూర్తి.

"నేనేం చేశాను? ఆఫీసరుగారికి నేనంటే ఎందుకు అంత కోపం?" అంటూ వెక్కి వెక్కి ఏడ్చాను.

"పిచ్చిపిల్లా! అతనికి కావల్సింది నువ్వు అర్థం చేసుకొని ఇవ్వలేదమ్మా."

"అంటే" అన్నాను అర్థంకాక.

'ఏముందీ! నువ్వు ఆ శీలా, రజియా, సావిత్రీ లాగా....'

"రామ్మూర్తిగారూ ?" అరిచాను.

"నిన్ను అలా చెయ్యమనటం లేదమ్మా, ఆఫీసరుగారి కోపానికి కారణం చెబుతున్నాను."

నాకు ఆశ్చర్యం వేసింది. నా కాళ్ళకింద భూమి నన్ను దగా చేస్తున్నట్లనిపించింది ఏబయ్ ఏళ్ళకు పైబడ్డ ఆ ఆఫీసరుకు ఇదేం రోగమో ! మళ్ళీ తన పిల్లలందరికీ పద్ధానుగు ఏళ్ళు నిండకుండానే పెళ్ళిళ్ళుచేసి అత్తవారింటికి పంపించాడట. పూర్వకాలం మనిషి అనుకున్నాను.

ఆరోజు మనసంతా చీదర చీదరగా వుంది. వారం రోజులవరకూ ఆ ఆఫీసరు నన్ను పిలవలేదు. ఆ తరువాత నేను పదిరోజులు శలవు పెట్టాను.

శెలవునుంచి ఆఫీసుకు వెళ్ళినరోజే పాత ఆఫీసరుకు బదిలీ అయిందని విన్నాను. వచ్చే ఆఫీసరు చాలా చిన్న వాడనీ, చాలా జలసారాయుడనీ, ఏవేవో చెప్పుకున్నారు. నాకు మరీ భయం పట్టుకుంది. స్టెనో ఉద్యోగం మానేసి ఏ టైపిస్టుగానో ఉద్యోగం సంపాదించుకుంటే బాగుండు ననుకున్నాను.

ఆరోజు కొత్త ఆఫీసరు వస్తున్నారు. వెళుతున్న ఆఫీసరుకు స్టాఫ్ పార్టీ చేస్తున్నారు. శీలా, సావిత్రీ, రజియా చక్కగా ముస్తాబై వచ్చారు. చాలా ఉత్సాహంగా హడావిడిగా తిరుగుతున్నారు.

నాలో ఉత్సాహం లేదు. టైపురైటరుముందు కూర్చొని **ఆ హడావిడి అంతా చూస్తున్నా**ను. అప్రయత్నంగా నేను కట్టుకున్న చీరవైపు చూసుకున్నాను. మనస్సు చివుక్కుమంది. వెలిసిపోయి బూడిదరంగుపడ్డ నీలంరంగు నేతచీర, కొంచెం సిగ్గనిపించింది. మళ్ళీ నాకు నేనే సమాధాన పడ్డాను. 'ఏం ! ఎందుకు సిగ్గుపడాలి ? మంచి దుస్తులు వేసుకోలేక పోవటంలో సిగ్గుపడాల్సిం దేముంది ? అయినా నా వేష భాషలతో ఆఫీసర్లకేం సంబంధం ! పని చేస్తున్నాను. జీతం ఇస్తున్నారు. '

నేను శీలావాళ్ళతో కలవాలని ప్రయత్నించినా వాళ్ళు నాకు దూర దూరంగా వుండటానికే ప్రయత్నిస్తున్నారు. ప్రతి చిన్న విషయానికి పక పకా నవ్వటం, పెద్దగా మాట్లాడటం, వయ్యారంగా నడవటం.... ఏమిటో ఏమిటో....అచ్చం ఆడపిల్లలా చేస్తుంటారు. వాళ్ళలా నాకు ప్రవర్తించటం రాదు. వాళ్లు మాట్లాడే అబద్ధాలు వింటూంటే మరీ బాధ అనిపించేది. ఎక్కడైనా బజార్లో ఎదురుపడితే, ఒకే ఆఫీసుల్లో పనిచేసే వాళ్ళం గదా అని "ఎక్కడినుంచి " అని ప్రశ్నిస్తే ఉలిక్కిపడి తప్పుకు పోతారు. ఆ సమయంలో వారి కళ్ళలో ఏదో భయం కన్పిస్తుంది స్పష్టంగా. ఇలాటివారు చాలామంది నల్ల ముసుగులో బ్రతుకుతుంటారు. ఎవరు ఎప్పుడు వారి

ముసుగును తొలగించి అసలు రూపాన్ని పట్టుకుంటారో అన్నట్టు బెదురు బెదురుగా బతుకుతుంటారు. అందువల్లనే ధైర్యంగా నీతిగా బతుకుతూ, నిజం మాట్లాడేవాళ్ళంటే వీళ్ళకు కిట్టదు.

ఓ మూల కూర్చొని ఆలోచిస్తున్న నేను 'ఏంమ్మా! ఇంకా ఇక్కడే వున్నావు ? పద పార్టీ మొదలయింది.' అన్న రామ్మూర్తి మాటకు వులిక్కిపడి ఈ ప్రపంచంలోకి వచ్చాను. యాంత్రికంగా లేచి రామ్మూర్తితో బయలు దేరాను.

'ఉన్నదే ఆఫీసులో నలుగురు ఆడవాళ్లు. వెళ్ళే వాళ్లు నిన్ను కూడా పిలవకూడదూ? వెకిలిముండ లెందుకు పిలుస్తారులే. వాళ్ళకు మాత్రం తెలియదూ ? నీ పక్క నుంటే హంస పక్కన కాకుల్లా వుంటామని' సణుక్కున్నాడు రామ్మూర్తి. ఆయన ఆప్యాయతకు నాకు కళ్ళలో నీరు తిరిగింది.

పార్టీలో అందరి కళ్ళూ ఆలస్యంగా వస్తున్న నావైపే తిరిగాయి. నేను కట్టుకున్న చీరను గురించి వద్దనుకుంటూనే సిగ్గుపడ్డాను. బెదురు బెదురుగా శీలా వాళ్ళకోసం వెదకాను. వాళ్లు ఆఫీసర్ల పక్కనే వున్న బల్లచుట్టూ కూర్చొని ఉన్నారు. వాళ్ళు నన్ను చూసి ముసి ముసిగా నవ్వుకుంటున్నారు. నాకు కళ్ళల్లో కారపునీళ్ళు పోసినట్లనిపించింది. గబగబా

వెళ్లి వాళ్ల దగ్గరే ఖాళీగావున్న కుర్చీలో కూర్చున్నాను. నేను వాళ్ళ దగ్గరకు వెళ్లి కూర్చుంటానని వాళ్ళనుకొని వుండరు. నేను అలా వెళ్ళి కూర్చోగానే కిక్కురుమనకుండా టిఫిన్ తింటున్నట్లు నటించసాగారు. నా హృదయంలో గర్వం తలెత్తింది. 'నా వ్యక్తిత్వంకింద మీ రెంత ? మీ దుస్తులు మెరుస్తాయి. మనస్సులో కారుచీకట్లు. ప్రపంచంలో తలెత్తుకొని బతికే ధైర్యంలేదు. నా దుస్తులు మలినంగా కనిపిస్తున్నాయి. కాని మనస్సులో చీకటి గదులు లేవు,' అని వాళ్లకు అరిచి చెబుదామనిపించింది.

'ఆమె గిరిజ. ఇక్కడ స్టెనో' అన్న పాత ఆఫీసరు మాటలు వినిపించి వులిక్కిపడి లేచి నిల్చున్నాను. కొత్త ఆఫీసరుకు నమస్కరించాను. అయన ప్రతి నమస్కారం చేసి 'కూర్చోండి' అన్నాడు. నా సర్వీసులో ఆఫీసరు ప్రతి నమస్కారం చెయ్యటం. బహువచన ప్రయోగం చెయ్యటం మొదటిసారి చూశాను. ప్రతి ఆఫీసరూ ఇంట్లో పెళ్లాన్ని పిల్చినట్లు 'నువ్వా, గిరిజా. ఇడిగో' అని పిల్చినవారే నాకు అలా అని పిలుస్తుంటే రక్తం కుతకుత లాడేది. కాని ఆఫీసర్లు.

శీలా, సావిత్రీ ఎందుకో కిలకిల నవ్వటం వినిపించి మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాను. నా పరధ్యానం చూసే నవ్వుతున్నారేమో ననిపించింది. అప్రయత్నంగా ఆఫీసర్ల వైపు చూశాను. కొత్త ఆఫీసరు నావంకే రెప్పవాల్చకుండా

చూస్తున్నాడు. నేను ఏదోగా అయిపోయ్యాను. తలవంచుకు గబగబా టిఫిన్ చెయ్యసాగాను. నాకు అలా కొత్త ఆఫీసరు నన్నే చూస్తున్నాడనే తలపు రాగానే కుర్చీలో ఇబ్బందిగా కదిలాను.

శీలా, సావిత్రీ రజియా కబుర్లు చెప్పుకుంటూ, మధ్య మధ్య ఫకపకా నవ్వుతున్నారు. అదంతా కొత్త ఆఫీసర్ని తమవైపు ఆకర్షించుకోవటానికేనని ఊహించగానే నా మనస్సంతా జుగుప్సతో నిండిపోయింది.

అంతా లేచారు. కొత్త ఆఫీసరు వెళుతూ వెళుతూ నా వంక అదోలా చూశాడు. నాకు తెలియకుండానే కళ్ళు సిగ్గుతో వాలిపోయాయి. మగవాడి దగ్గర ఆడది సిగ్గు పడుతుందంటే తన బలహీనతను తెలియపరచుకోవటమే నని నా భావం. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఎన్నడూ లేని ఈ అనుభూతి ఏమిటి? ఇన్ని ఆదర్శాలు మాట్లాడిన నాలో కూడా మామూలు ఆడపిల్లలాగే బలహీనత ఏర్పడటంలేదు గదా అని సందేహం గలిగింది అలా ఎన్నటికీ జరగదు....జరగటానికి వీలులేదు అనుకున్నాను.

నా బలహీనతను శీలావాళ్ళు కనిపెట్టలేదు గదా అని వాళ్ళవైపు చూశాను. వాళ్ళ కళ్ళలో అసూయ తేలుపిల్లలా కొండీ ఎత్తి తిరగటం గమనించాను. అది చూసిన నాలో గర్వం నీళ్ళలో సోడా వేసినట్లు పొంగింది ఇలాటి

విజయగర్వంలో వుండే ఆనందాన్ని మొదటిసారిగా చవి చూశాను.

కొత్త ఆఫీసరు పేరు కుమార్. అందం, అధికారం, హుందాతనం అన్నీ ఒకే వ్యక్తిలో మూర్తీభవించాయా అన్నట్లుంటాడు. ముఖంలో మంచితనం కనిపిస్తుంది. ఎందుకో అతని యడల నా హృదయంలో ప్రత్యేక స్థానం ఏర్పడిందనుకున్నాను.

అతను డ్రాఫ్ట్ డిక్టేటు చేస్తున్నంతసేపూ నన్నే గమనిస్తూ కూర్చుంటాడని తలవంచుకొని నోట్సు తీసుకుంటున్న నాకు అనిపించేది. అలాటప్పుడు నాకు చాలా ఇబ్బందిగా వుండేది. అక్కడనుంచి వెళ్ళిపోవటం కూడా ఇష్టం వుండేది కాదు. భయం, ఆనందం రెండూ హృదయంలో రాక్ అండ్ రోల్ నృత్యం చేసేవి. ఆ అల్లరిలో ఆయన చెప్పేది ఏదీ అర్థం అయేది కాదు. తీరా డ్రాఫ్ట్ టైపు చేసి తెస్తే ఆయన పకపకా నవ్వేవాడు. ఆయన డిక్టేటు చేసిన దానికీ నేను టైపు చేసిన దానికీ ఎక్కడా సంబంధం వుండేది కాదు. భయంతో వణికిపోయేదాన్ని, ఆఫీసరుకు ఎక్కడ కోపం వస్తుందోనని. కాని ఆయన నవ్వుతూ డ్రాఫ్ట్ రాసిచ్చి టైపు చెయ్యమనేవాడు. ఎంత 'మంచివారు' అని మనస్సులోనే కృతజ్ఞత తెలుపుకొనేదాన్ని.

ఒకరోజు ఐదు గంటలకు పది నిముషాలున్నదనగా ఆయన నన్ను పిల్చాడు. డ్రాఫ్ట్ డిక్టేటు చేస్తున్నాడు. కాని ఆయనలో ఆరోజు నాకు ఏదో మార్పు కనిపించింది. పరధ్యాన్నంగా వున్నాడు. ఆఫీసులోనే 7 గంట లయింది.

నన్ను ఇంటిదగ్గర డ్రాప్ చేస్తాననీ, తనతో రమ్మనీ అన్నాడు కుమార్. నాకు గుండెలో రైళ్లు పరుగెత్తసాగాయి. రాను అనే ధైర్యం లేదు. ఒకటి ఆయన నాకు ఆఫీసరు. ముఖ్యంగా ఆయనంటే నాకు గౌరవం....ఒక రకంగా ఇష్టమనే చెప్పవచ్చును. ఆయన కోపానికి గురికావటం జరిగితే నేను భరించలేను. ఇదీ ఒక రకమైన బలహీనతే.

కిక్కురుమనకుండా బెదిరే చూపులతో, అదిరే గుండెలతో, వణికే కాళ్ళతో కారు ప్రక్కన నిల్చున్నాను, బిక్కు బిక్కుమంటూ. వచ్చి డ్రైవర్ సీటులో కూర్చుంటూ నన్ను పక్క సీటులో కూర్చోమన్నట్లు డోర్ తెరచాడు. అలాగే నిలబడి వుండటము చూసి "ఊఁ, ఎక్కు" అన్నాడు. ఆ స్వరంలో కొంత అధికారం కూడా లేకపోలేదు అదే ఇంకో ఆఫీసరయితే 'ఏం ఎందుకు ఎక్కాలి ?' అని ఎదిరించి వుండేదాన్నే. కాని కొందరి అధికారంలో కూడా ఎంత ఆనందం దొరుకుతుందో మొదటిసారిగా తెలుసుకున్నాను. కిక్కురుమనకుండా ఎక్కి పక్క సీట్లో వరిగి కూర్చున్నాను. చేతులు చల్లగా వున్నాయి. కారు

చార్‌మినార్ దాటిపోతోంది. అంతవరకూ కొయ్యబొమ్మలా బిగుసుకొని కూర్చున్న నా చేతిని ఓ బలమైన చెయ్యి నొక్కింది. ఉలిక్కిపడ్డాను. వళ్ళంతా తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్లనిపించింది.

"గిరిజా !" అన్నాడు కుమార్ ఒక చేత్తో స్టీరింగ్ పట్టుకొని మరో చేత్తో నా చేతిని పట్టుకొని.

పళ్ళచక్రం క్రింద నలిగిపోతున్న చెరకుగడలా జవ జవ లాడిపోయాను, భయంతో.

"భయపడకు. నేను ఆఫీసర్నని మర్చిపో. ఇప్పుడు మనం ఒక స్త్రీ ఒక పురుషుడు మాత్రమే" అన్నాడు నన్ను దగ్గరకు లాక్కోటానికి ప్రయత్నిస్తూ.

"నేను దిగిపోతాను. దయచేసి కారు ఆపండి" అనాలనుకున్నాను కాని గొంతు పెగలలేదు. అతని చేతినుంచి నా చేతిని లాక్కోనా లనుకున్నాను, శక్తిలేద.

"భయపడకు ఇంటి దగ్గరే దించేస్తాను." అంటూ నన్ను ఇంకా దగ్గరకు లాక్కున్నాడు. నేను పెనుగు లాడటంతో విసుగ్గా వదిలి కారు ఆపాడు. "నేనంటే నీ కిష్టం లేదా ? చూడు. నా కళ్ళలోకి చూసి చెప్పు !" అన్నాడు.

"అవును. నువ్వంటే నాకు ఇష్టమే. చాలా ఇష్టం; కాని నాకు ఇలా బతకటం ఇష్టంలేదు. నా అందమైన

కలల్ని చెదర కొట్టవద్దు. " అందామనుకున్నాను. కాని అనలేదు. అతను నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించడని అతని ధోరణే తెలుస్తుంది. నేను మంచి దాన్నట ; అందువల్లనే నాతో స్నేహం చెయ్యాలని వున్నదట.

ఇలాటి స్నేహం చెయ్యటానికి కూడా మగవాడికి మంచి ఆడవాళ్ళే కావాలి కాబోలు. మంచి అంటే అతని దృష్టిలో ఏమిటో నా కర్థం కాలేదు. నేను శీలావాళ్ళలాటి దాన్ని కాదని తల పగలకొట్టుకొని చెప్పాలనిపించింది. కాని ఏం ప్రయోజనం ? అతనికి నిజంగా కావాల్సింది నేను ఎలాటిదాన్నని కాదు ఒకర్ని గురించి ఒకరు తెలుసుకోవల్సిన అవసరం అతనికి కనిపించదని నాకు తెలుసు.

" మీ చెల్లెల్ని ఎవరయినా ఆఫీసరు ఇలా చేసివుంటే ఏం చేస్తారు ? " అని అనాలనిపించింది. కాని నాకు నాలుక పిడచకట్టుకొని పోతోంది. కారు తలుపుకు తల కొట్టుకొని ఏడవటం తప్ప ఒక మాట మాట్లాడలేకపోయాను. దానికి కూడా ఆయన అంతగా కదలలేదు. ఆడవాళ్ళంతా మొదట ఇలాగే గొడవ పెడతార్లే అన్నట్లుంది ఆయన ధోరణి. నా మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవటానికి మారుగా అతనికి నామీద కోపం చిరాకూ కలిగింది విసురుగా కారు

స్టార్టు చేస్తూ 'మీ ఇల్లు ఎక్కడ ?' అన్నాడు. చెప్పాను ఏడుపు గొంతుతో. కారు జోరుగా పోతోంది. 15 నిమిషాలు గడచినా ఇల్లు రాలేదు. అప్పుడు నా కర్థం అయింది.

కారు ఎక్కడికి వెళ్ళింది, ఆ తరవాత ఏమయిందీ నేను రాయలేను.

'నీవు జీవితంలో చూసిన ఆడపిల్లల్లో నేను ఒకదాన్ని కావచ్చును, నీ దృష్టిలో. కాని నీవు నా జీవితాన్నంతా కారుమేఘంలా ఆక్రమించుకుంటావనీ, ఈ సంఘటన ప్రభావం నా జీవితాన్ని తారుమారు చేస్తుందనీ ఎలా చెప్పగలను? చెప్పినా ఆయనకు అర్థంకాదు. ఆ మాటంటేనే ఆయనకు కోపం. ఆఫీసు కాగితాలను అర్థంచేసుకోవటమూ స్త్రీ హృదయాన్ని అర్థంచేసుకోవటమూ ఆయన దృష్టిలో ఒకటే.

కారు ఇంటిముందు ఆగింది. "నేను రేపు కేంపుకు వెళుతున్నాను. రెండవతేదీ మళ్ళీ కల్సుకుందాం." అంటూ కారు స్టార్టుచేశాడు, నా జవాబుకోసం ఎదురు చూడకుండానే. నేను గబగబా ఇంట్లోకి వెళ్ళాను. నా వెనక ఎవరో చీకటి మనిషి వెంబడించినట్టు అనిపించింది.

చెల్లి ముఖంలోకి కానీ, తమ్ముడి ముఖంలోకి కానీ చూసే ధైర్యం లేకపోయింది. గదిలోకి వెళ్ళి గడియ

బిగించుకొని దిండులో ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చాను. అలా ఎంతసేపు ఏడ్చానో నాకే తెలియదు.

నేను తప్పు చేశాను. ఆ ఆఫీసరంటే నాలో తెలియకుండానే బలహీనత ఏర్పడింది. అందువల్లనే అతను 'ఎక్కు' అనగానే కారులో ఎక్కాను. అలాంటి నేను ఎంత మొత్తుకున్నా నా గత జీవితాన్ని ఎలా నమ్ముతాడు ?

నా కలలు కరిగిపోయాయి. నా ఆశయాలూ, నా ఆశలే నన్ను మోసం చేశాయి. నేను జీవితంలో మొదటిసారిగా గౌరవించిన పురుషుడి చేతిలోనే దగా పడిపోయాను.

తెల్లవారి ఆఫీసుకు ఏ ముఖం పెట్టుకొని వెళ్ళను. నాకూ, శీలకూ ఎలాంటి భేదం వుండదు ఇకనుంచీ. ఆఫీసులోని ప్రతి మగవాడూ, నాతో సరసాలాడడానికి జంకడు. ఆఫీసరు మళ్లీ మూడవ తేదీ వస్తాడు. తనతో రమ్మంటాడు. ఒకసారి లొంగిన నేను రెండోసారి తప్పుకో గలనా ? మొదట ఆయన నా యెడల చూపిన ఆదరణకూ, ఆప్యాయతకూ ఇకముందు చూపబోయేదానికీ ఎంతో భేదం వుంటుంది. అతని దృష్టిలో కూడా నేను లోకువే అయిపోతాను. ఒకసారి కాలు జారకుండానే వుండాలి ; జారిందా ఆ పతనం ఎక్కడకు పోయి ఆగుతుందో ఎవరూ చెప్పలేరు.

నా జీవితం మలుపు తిరిగింది. కాలు బురదలో పడింది. వెనక్కు రాలేను. ముందుకుపోతే పూర్తిగా ఊబిలో దిగబడిపోతానని తెలుసు. అలాటి బతుకు నేను బతకలేను.

పన్నెండు కొట్టింది. ప్రపంచమంతా నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయింది. కొందరు దురదృష్టవంతులకు స్వప్నాలు కూడా సుఖవంతమైనవి రావు. నేను మెళుకువతోనే దుఃస్వప్నం చూస్తున్నాను.

ఇక నాకు జీవించే హక్కులేదు. మన హిందూమతం ఆత్మహత్య మహా పాపం అని చెబుతుంది. మేధావుల దృష్టిలో ఆత్మహత్య పిరికివాడు చేసేపని. కాని జానకీ ! ఆత్మహత్య చేసుకోవటానికి ఎంతో సాహసం కావాలంటాను నేను. హత్య చేసేవాడికంటే ఆత్మహత్య చేసుకొనేవాడికి ఎక్కువ సాహసం వుండాలి. సగం వేళ్ళూ, కాళ్ళూ ఊడిపోయిన కుష్టువాడు కూడా బతకటానికి ఎందుకు తాపత్రయపడతాడు ? బతుకుమీది ఆశను వదులుకో లేకనే.

ఈ మధ్య నువ్వు రేడియోలో 'జీవితమంటే' అనే విషయంమీద మాట్లాడావు. జీవితం అంటే మృత్యువుకోసం నిరీక్షణ అన్నావు. అప్పుడు నీ చాదస్తం చూసి నాకు నవ్వొచ్చింది. కాని ఆ వాక్యాలు ఈరోజు నాకు గుర్తొస్తున్నాయి.

"జీవితం అనంతమూ, స్థిరమూ, జడమూ అయిన మహా మృత్యువునుంచి విడివడిన చంచలమూ, క్షణికమూ అయిన మెరుపులాంటిది. జీవితాన్ని మళ్ళీ అదే నిస్తబ్ధత ఆవరించి వేస్తుంది. ఈ భావం వినటానికి చాలా భయంకరంగా వుంది. కాని అదే సత్యం. సత్యంలోనే శివం, సుందరం దాగివున్నాయి. కాబట్టి సత్యానికి దూరంగా పారిపోవటానికి ప్రయత్నించటంగానీ, దాన్ని చూసి భయపడటము కానీ మూర్ఖత్వం. అంటే జీవితం ఓ నిరీక్షణ అన్నమాట. దేనికోసం నిరీక్షణ? ఆ మహా నిస్తబ్ధతలో, తను ఏ మూలపదార్థం నుండి విడిపోయిందో ఆ మూలపదార్థంలో ఐక్యమయే రోజుకోసం నిరీక్షణ."

అని నువ్వు చెప్పింది నా విషయంలో అక్షరాలా నిజం అయింది జానకీ! నా ఈ పాతిక సంవత్సరాల జీవితం ఈరోజు కొరకే నిరీక్షించింది. నేను వెళ్ళిపోతున్నాను. బతుక్కూ చావుకూ అట్టే దూరం లేదు.

నేను జీవితానికి ఎదురు ఈదటానికి ప్రయత్నించి ఓడిపోయాను. దగాపడిపోయాను. కాని అందరితోపాటు ప్రవాహానికి అనుకూలంగా ఈదే జీవితంతో నేను రాజీ పడలేను. అందుకే, బతికి చచ్చేకంటే చచ్చి బతుకుదామని వెళ్ళిపోతున్నాను.

నా చెల్లినీ, తమ్ముణ్ణీ, ఈ విశాల ప్రపంచంలో దిక్కులేనివాళ్ళను చేసి వెళ్ళిపోతున్నాను.

జానకీ! నువు రచయిత్రివి. నా కథ రాస్తావు గదూ! శెలవు.

ఇట్లు
నీ గిరిజ"

ఉత్తరం పూర్తిచేశాను. చదివినంతసేపూ కన్నీటితో ఉత్తరం తడిసిపోయింది. నిట్టూర్చా, ఉత్తరం మడుస్తూ.

గిరిజ కథ రాయమంటుంది. నీరజ కూడా కథ రాయమంటుంది. ఇద్దరిదీ ఒకే కోరిక. కాని ఆ కోరికలో ఎంత వైవిధ్యం వుంది!

కొందరి స్వార్థపరుల కలుషిత హస్తాల్లో ప్రేమ పేరుతో గిరిజలాటివారి జీవితాలు నలిగిపోతుంటే, ఎండ మావులకోసం అర్రులుచాస్తూ అమాయకంగా శీలలాటివారు పతనం అయిపోతుంటే, నీరజకోసం మోహన్ సుశీల కథలు రాయటం సాధ్యమయేదేనా? పక్కింటి కాంతమ్మా, ఎదురింటి రాఘవరావూ, బస్టాండ్‌లోని బిచ్చగాడూ, గిరిజ లాంటి అభాగ్య స్త్రీలూ, నేను రాసే ప్రేమ కథకు నిరంతరం అడ్డు వస్తూనే వున్నారు.

తలెత్తి చూశాను. కిటికీ అద్దాలలోనుంచి వెలుతురు కనిపిస్తోంది. భళ్ళున తెల్లవారింది. నేను రాయదలచుకున్న కథ పూర్తికాలేదు.

( యువ 1965 )